క్లుప్తంగా

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి పద్మావతిపురానికి చెందిన మహేష్ నాయుడు అనే నిందితుడికి 6 నెలల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు.

రెండు ప్రైవేట్ ట్రావెల్ బస్సుల సీజ్

– రూ.6లక్షల జరిమానా



సీజ్ చేసిన బస్సులతో అధికారులు

తిరుపతి మంగళం : జిల్లా రవాణాశాఖ అధికారులు బుధవారం చేపట్టిన వాహన తనిఖీల్లో పర్మిట్ లేకుండా తిరుగుతున్న రెండు ప్రైవేట్ ట్రావెల్ బస్సులను సీజ్ చేశారు. రెండు బస్సులకు రూ.6లక్షల జరిమానా విధించారు. సకాలంలో ట్యాక్స్ చెల్లించకుండా వాహనాలను తిప్పితే సీజ్ చేస్తామని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా వాహన తనిఖీలను ముమ్మరం చేసినట్లు వెల్లడించారు.

చెంచురెడ్డికి కన్నీటి వీడ్కోలు

– రాజకీయ గురువు పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



చెంచురెడ్డి అంత్యక్రియల్లో బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డికి అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం ఈమేరకు అంతిమయాత్రలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. తన రాజకీయ గురువు పాడే మోశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ కమిటీ మాజీ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, నేతలు పగడాల రాజు, కొత్తపాటి శ్రీనివాసులురెడ్డి, ఉత్తరాజి శరవణ కుమార్, శ్రీవారి సురేష్, మున్నా రాయల్, జయశ్యామ్ రాయల్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 77,596 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,565 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.73 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశిత సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వస్తే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

గంగరంగ వైభవం



గంగమ్మ దర్శనం కోసం పోటెత్తిన భక్తులు (ఇన్‌సెట్) అమ్మవారి ప్రతిమ

- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ముగిసిన రేణిగుంట నడివీధి గంగమ్మ జాతర

రేణిగుంట : నడివీధి గంగమ్మ దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బుధవారం ఉదయం నుంచే ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారిని సేవించుకుని పరవశించారు. ఈ క్రమంలో వేకువనే పసుపుతో చేసిన అమ్మవారి ప్రతిమను ఊరేగింపు తీసుకువచ్చి వేపాకు పందిరి కింద కొలువుదీర్చారు. ప్రత్యేక క్యూల ద్వారా భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గంగమ్మను దర్శించుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

భారీగా కుంభం

సాయంత్రం అమ్మవారికి కుంభం పెట్టి మొక్కు లు తీర్చుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. భైరాగి వేషాలతో దిష్టి కుండలను నెత్తి న పెట్టుకుని మహిళలు, చిన్నారులు సమూహాలు గా నడివీధి గంగమ్మను సేవించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో భక్తులకు వసతులు కల్పించారు. అర్ధరాత్రి తర్వాత అమ్మవారి ప్రతిమను ఊరేగించారు. అనంతరం నిమజ్జనంతో జాతరను పరిపూర్ణం చేశారు.



అమ్మవారికి కుంభం సమర్పిస్తున్న భక్తులు



రేణిగుంటలో భక్తుల కోలాహలం

వెండి మబ్బుల కొండ



బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉండగా సప్తగిరులను కమ్మేసిన వెండి మబ్బులు

వాన కష్టాలు



బుధవారం ఉదయం నుంచి తిరుపతి నగరంలో చిరుజల్లులు కురుస్తుండగా వాహన చోదకుల అవస్థలు

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

కలెక్టర్‌కు 'స్కోచ్' అవార్డు



వెంకటేశ్వర్, కలెక్టర్

తిరుపతి అర్బన్ : స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడంలో కలెక్టర్ వెంకటేశ్వర్, బృందం కృషికి స్కోచ్ పురస్కారం దక్కనుంది. బుధవారం ఈ మేరకు స్కోచ్ గ్రూప్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ దలాల్ అవార్డును ప్రకటించారు. సెప్టెంబర్ 20వ తేదీన న్యూఢిల్లీలో కలెక్టర్ వెంకటేశ్వర్ అవార్డును అందుకోనున్నారు.

'సీకామ్'కు అటానమస్ హోదా

తిరుపతి సిటీ: తిరుపతి అన్నమయ్య సర్కిల్‌లోని సీకామ్ డిగ్రీ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదా కల్పించిందని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కళాశాల యాజమాన్యానికి అధికారిక ఉత్తర్వులు అందించారు. కళాశాలకు ఐదేళ్ల పాటు అటానమస్ హోదా వర్తిస్తుందని పేర్కొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్ : తిరుపతి రైల్వేస్టేషన్ 3వ నంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద కదులుతున్న రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం జరిగింది. వివరాలు.. ఉదయం 11:30 గంటల సమయంలో ఓ వ్యక్తి అకస్మాత్తుగా పరిగెత్తుకెళ్లి బయలుదేరుతున్న రైలు కింద పడిపోయాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని రైల్వేపోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించాలని వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440352765 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

శ్రీసిటీ-వీఆర్‌వీ పరిశ్రమ వితరణ

శ్రీసిటీ (వరదయ్యపాళెం) : శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీలోని చార్ట్-వీఆర్‌వీ పరిశ్రమ సామాజిక బాధ్యతలో భాగంగా వరదయ్యపాళెం మండలం నాగానందపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యా వసతులు సమకూర్చింది. సుమారు రూ.31 లక్షల వ్యయంతో తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గది నిర్మాణాలను పూర్తిచేసింది. స్కూల్ ఆవరణ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించింది. మొక్కలు నాటి, స్కూల్ మొత్తానికి రంగులు వేయించింది. ఈ మేరకు బుధవారం శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి సమక్షంలో చార్ట్ ఇండస్ట్రీస్ ఎండీ పర్వేశ్ మిట్టల్, డైరెక్టర్ యామిని సిన్హా చేతులమీదుగా నూతన వసతులను ప్రారంభించారు. వీఆర్ హెచ్ఆర్ మేనేజర్ కందస్వామి, ఎంఈఓ-2 గున్నయ్య పాల్గొన్నారు.

సచివాలయ సెక్రటరీలకు వేధింపులు

- తిరంగా ర్యాలీకి రాలేదంటూ 281 మందికి మెమోలు



సెక్రటరీలకు జారీ చేసిన మెమో

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు సచివాలయ సెక్రటరీలకు వేధింపులు తప్పడం లేదు. అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివిధ సర్వేలు, టెలి కాన్ఫరెన్స్‌లతో ముప్పు తిప్పలు పెడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం నగరంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీకి హాజరు కాలేదంటూ 281 మంది సచివాలయ సెక్రటరీలకు మెమోలు జారీ చేశారు. దీనిపై సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు.

సర్క్యులర్ లేకుండానే..

తిరుపతి నగరంలో మంగళవారం ఉదయం 6 గంటలకే హర్ గర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సచివాలయ సెక్రటరీలు హాజరుకావాలని ఎలాంటి సర్క్యులర్ జారీ చేయలేదు. కనీసం వాట్సాప్ గ్రూప్‌ల్లో సైతం మెసేజ్ కూడా పెట్టలేదు. కేవలం సోమవారం రాత్రి నిర్వహించిన పీ4 సర్వే టెలీ కాన్ఫరెన్స్‌తో కార్యదర్శులందరూ ర్యాలీకి రావాలని ఓ మాట చెప్పి చేతులు దులిపేసుకున్నారు. అయినప్పటికీ కొంతమంది హాజరయ్యారు. అయితే అధికారులు తమ తప్పిదం మరచి సెక్రటరీలకు మెమోలు జారీ చేసేశారు.

ఎక్కువమంది మహిళలే

ఉదయం ఆరు గంటలకు నిర్వహించిన హర్ గర్ తిరంగా ర్యాలీకి ఎక్కువమంది మహిళా సెక్రటరీలు హాజరు కాలేకపోయారు . మెమోలు జారీ చేసిన 281 మందిలో దాదాపు 190 మంది మహిళ సెక్రటరీలే ఉండడం గమనార్హం. ఇంట్లో పనులు పూర్తి చేసుకుని ఉదయం 6 గంటలకే ర్యాలీకి హాజరు కావాలంటే మహిళలకు ఎంత ఇబ్బందో కూడా అధికారులు గమనించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా పీ4 సర్వే సచివాలయ కార్యదర్శుల పాలిట శాపంగా మారింది. ప్రతి ఒక్కరూ ఐదు కుటుంబాలను పీ4లో చేర్పించాలని అధికారులు ఒత్తిడి చేస్తుండడం ఇబ్బందిగా తయారైంది. వేళాపాళా లేకుండా టెలీకాన్ఫరెన్స్‌లు పెడుతుండడం సరికాదని కార్యదర్శులు వాపోతున్నారు. అధికారులు చేయాల్సిన పనులు కూడా తమపై రుద్దుతూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ 16 గంటలపాటు పనిచేయిస్తున్నారని, పైగా తీవ్రంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

బాధ్యతగా అటవీ సంరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి రూరల్ : అడవులు, వన్యప్రాణుల సంరక్షణను బాధ్యతగా తీసుకుని ఫారెస్ట్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం ఎర్రావారిపాళెం మండలం తలకోనలోని అటవీశాఖ అతిథిగృహంలో జిల్లా అటవీ, వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అడవుల సంరక్షణకు ప్రత్యేకంగా మియావకీ ప్లాంట్లను అభివృద్ధి చేయాలన్నారు. వన్యప్రాణులను ఎవరైనా వేటాడితే నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు పెట్టి జైలుకు పంపాలని స్పష్టం చేశారు. ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన రైతులకు సకాలంలో పరిహారం అందించాలని సూచించారు. అటవీ భూముల ఆక్రమణకు యత్నిస్తే కేసులు నమోదు చేయాలని కోరారు. అనంతరం అటవీ అధికారులు తయారు చేసిన అజెండాలోని అంశాల వారీగా సమీక్షించారు.

ప్రధాన అంశాలు ఇవీ...

- ఏనుగులు, చిరుతల వివరములను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి.
- ఎలిఫెంట్ అటాక్ ఫోర్స్‌ను మరింత అప్రమత్తం చేయాలి.
- ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన వారికి పరిహారం కింద సుమారు రూ. 60లక్షల చెల్లింపులకు ఆమోదం తెలిపారు.
- పెండింగ్‌లోని రెవెన్యూ, అటవీ భూ వివాదాలపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కరించాలి.
- అటవీ, వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశాన్ని సెప్టెంబర్‌లో సత్యవేడు రేంజ్ పరిధిలోని ఉబ్బలమడుగు కమ్యూనిటీ బేస్ట్ ఎకో టూరిజం సెంటర్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో అటవీ సంరక్షణాధికారి సెల్వం, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఆర్‌ఓ నరసింహులు, ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, డివిజనల్ అటవీ అధికారి శ్రీనివాసులు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అరుణ్‌కుమార్, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ పాల్గొన్నారు.

విధేయులకే 'పురస్కారం'?

తిరుపతి అర్బన్ : జాతీయ పండుగ రోజున జిల్లా స్థాయి అధికారుల చేతులమీదుగా పురస్కారం అందుకోవడమనేది ఉద్యోగుల కల. అవార్డు అందుకుంటే అందులోని సంతృప్తి అంతా ఇంతా కాదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఉద్యోగులకు పంపిణీ చేసే ఉత్తమ పురస్కారాల ఎంపికకు సంబంధించి పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తమకు విధేయులుగా పనిచేసే వారినే అవార్డులకు ఎంపిక చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

కూటమి పాలనలోనే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది ఆగస్టు 15న 93 విభాగాల్లో పనిచేస్తున్న 392 మందికి అవార్డులు అందించారు. అలాగే ఈ ఏడాది జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా 479 మందికి పురస్కారాలు ప్రదానం చేశారు. సాధారణంగా ఒక్కోవిభాగానికి సరాసరిన 5 మందికి అవార్డులు ఇవ్వాల్సి ఉంది. ఉద్యోగుల సంఖ్య మేరకు, వారు అందించిన సేవలను పరిగణలోకి తీసుకుని పురస్కారాలకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే 479 మందిలో పోలీస్‌శాఖలోనే 100 మందికి, కలెక్టరేట్‌లోని 45 మందికి (కలెక్టరేట్, కలెక్టర్, జేసీ బంగ్లాలో పనిచేసేవారు), రెవెన్యూ శాఖకు 31 అవార్డులను అందించారు. వైద్య విభాగానికి మాత్రం 15 అవార్డులు, ఆర్టీసీలో 4,600 మంది ఉద్యోగులున్నప్పటికీ 4 అవార్డులు మాత్రమే దక్కాయి. మరోవైపు వందల సంఖ్యలో సేవలు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులకు కేవలం 3 పురస్కారాలు మాత్రమే ఇచ్చారు. వాణిజ్య పన్నులశాఖకు 2, దేవదాయశాఖకు 3, అటవీశాఖకు 5 అవార్డులు మాత్రమే ప్రదానం చేశారు. దీనిపై గతంలో పలువురు ఉద్యోగులు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేశారు.

500 మందికి పురస్కారాలు?

తిరుపతిలోని తారకరామా స్టేడియంలక్ష శుక్రవారం నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవం వేడుకల్లో 500 మందికి పురస్కారాలు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా కలెక్టరేట్‌లో అధికారులు విభాగాల వారీగా కసరత్తు చేస్తున్నారు. అయితే ఈ సారైనా పారదర్శకంగా ఉద్యోగులను అవార్డులకు ఎంపిక చేస్తారా లేదా విధేయులకే కట్టబెడతారా అంటూ పలు విభాగాలకు చెందిన అధికారులు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అవార్డు గ్రహీతల జాబితా విడుదల కానుంది.


డ్రోన్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి కృషి



డ్రోన్‌లను పరిశీలిస్తున్న వీసీ అప్పారావు తదితరులు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో డ్రోన్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీలో రిమోట్ పైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ మంజూరు కోసం పలు సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు స్పేస్ టెక్నాలజీ, డ్రోన్-స్పేస్ టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్, వర్చువల్ ప్రొడక్షన్, సెమీ కండక్టర్స్ వంటి సాంకేతికతలకు టెక్నాలజీ లెర్నింగ్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ శిక్షణ వసతులను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డ్రోన్ సిమ్యులేటర్ సాఫ్ట్‌వేర్‌తో ప్రాక్టీస్, క్లాస్ రూమ్ సౌకర్యాల కోసం గ్రౌండ్‌ను తనిఖీ చేసినట్లు వివరించారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు, డ్రోన్ డైరెక్టరేట్ ప్రణవ్, ఏరోస్పేస్ లిమిటెడ్ డైరెక్టర్ అంజలి, డిప్యూటీ డైరెక్టర్ ఆపరేషన్స్ కుంజలత, చేతల్ సింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ కో-ఆర్డినేటర్ ఆచార్య ధర్మారెడ్డి, రుసా సీఈఓ వంశీకృష్ణ పాల్గొన్నారు.

17న మెగా వైద్యశిబిరం



వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న ఆదివారం ఉదయం 9 గంటల నుంచి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహించే మెగా వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు గౌడ్, దళిత సంఘ నేత పి.అంజయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం వద్ద మెగా వైద్యశిబిరం ప్రచార కరపత్రాలను వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ అధ్యక్షుడు పరసారత్నం సతీమణి కస్తూరమ్మ 5వ వర్ధంతి సందర్భంగా మెగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఈ శిబిరంలో 15 సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లతో పాటు స్విమ్స్, టాటా కేన్సర్ ఆస్పత్రి, అరవింద్ ఆస్పత్రుల వైద్య బృందం అన్ని వ్యాధులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శరత్‌కుమార్, జగదీష్, గిరి, రవికుమార్‌పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన



పొలం పరిశీలనలో బీఆర్‌సీ సభ్యులు

తిరుపతి రూరల్ : మండలంలోని వేమూరులో రైతు అయ్యప్ప నాయుడుకు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం రాయలసీమ రీజియన్ బయో ఇన్పుట్స్ రిసోర్స్ సెంటర్ (బీఆర్‌సీ) ప్రతినిధులు 40 మంది సందర్శించారు. తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫామింగ్ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా రాష్ట్ర రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం ఆధ్వర్యంలో వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. ఏటీఎం మోడల్‌లో విత్తనాలు, దేశీయ పద్ధతుల్లో నారు నాటారు. అనంతరం బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, దశపర్ని కషాయాలతో పాటు పంచగవ్య తయారీ విధానాలను అధ్యయనం చేశారు. చెరుకు సాగులో వినూత్నంగా ఆకుకూరలు, కూరగాయలు విత్తనాలు నాటారు. బీడు భూముల్లో పీఎండీఎస్ విత్తనాలను చల్లారు. పూర్తిస్థాయిలో కషాయాల తయారీ విధానాలను రైతు అయ్యప్ప నాయుడు క్షుణ్ణంగా వివరించారు. ప్రాజెక్టు అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, ఏపీఎం సత్యనారాయణ, జిల్లా రిసోర్స్ పర్సన్లు నాగరాజు, నరేంద్ర పాల్గొన్నారు.

'పరిశోధక'.. వేదన తీరక!



కళాశాల వరండాలో కింద కూర్చుని నోట్స్ రాసుకుంటున్న విద్యార్థి

తిరుపతి సిటీ : ఎస్వీయూ అర్థశాస్త్ర విభాగంలో ఒక పరిశోధక విద్యార్థి అవమానకర పరిస్థితిని ఎదుర్కొన్నారు. పీహెచ్‌డీ చేసేందుకు విభాగానికి వచ్చిన ఆ విద్యార్థి కూర్చోవడానికి గది లేక కాలేజీ వరండాలో నేలపై కూర్చొని నోట్సు రాసుకుంటున్నారు. ఇది గమనించిన ఎస్ఎఫ్ఐ ఎస్వీయూ కార్యదర్శి వినోద్‌కుమార్ తక్షణమే ఈ విషయాన్ని కాలేజీ వైస్ ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి శాస్త్రీయ, మేధోపర అభివృద్ధికి ఆయువుపట్టుగా ఉన్న పరిశోధక విద్యార్థులకు గదులు కేటాయించకపోవడం అత్యంత దారుణమన్నారు. నేటికీ కొంతమంది ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందినా వారి ఛాంబర్లను వీడకపోవడం విచారకమని మండిపడ్డారు. పలు విభాగాలలో అనేక గదులు ఖాళీగా ఉన్నప్పటికీ పరిశోధకులకు గదులు కేటాయించకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థంకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొంతమంది అధ్యాపకులు పరిశోధకులను అకడమిక్ పనుల కంటే తమ వ్యక్తిగత, ఇంటి పనులకు వాడుకోవడం, వెట్టిచాకిరి చేయించడం దుర్మార్గమన్నారు. దీనిపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరిశోధక విద్యార్థులతో కలిసి సంబంధిత విభాగాల ఎదుట నిరసనకు దిగనున్నట్లు హెచ్చరించారు. ఈ క్రమంలో వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

క్లుప్తంగా

ఘనంగా కుంభాభిషేకం

చంద్రగిరి: స్థానిక చంద్రగిరి పాతపేట రెడ్డివీధిలో నిర్మించిన శ్రీసుందర వినాయక స్వామివారి ఆలయ కుంభాభిషేక మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్య మండపారాధన, అంకురార్పణ, వాస్తుపూజ, వాస్తు హోమం చేపట్టారు. అనంతరం ప్రధాన దేవతా ఆరాధాన, కలశస్థాపనలు, మూలమంత్ర హోమాలు, జీవన్యాసం, నేత్రోన్మీలనం, గోదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. తదుపరి శ్రీసుందర వినాయక స్వామితో పాటు నాగాలమ్మ విగ్రహ కుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

సమస్యలను పరిష్కరించండి



మాధవ్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

తిరుపతి సిటీ: రాష్ట్రంలోని పలు వర్సిటీల్లోని డిగ్రీ, జూనియర్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఏబీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి విన్నవించారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం నిర్వహించిన మేధావుల సదస్సుకు విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఏబీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర కోశాధికారి ప్రొఫెసర్ రాజశేఖర్, ప్రతినిధులు డాక్టర్ రవిశంకర్, డాక్టర్ పద్మావతమ్మ, ప్రియవర్ధన బాబు, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ సంధ్య, డాక్టర్ వివేక్, డాక్టర్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి వీల్ చైర్ల వితరణ



వీల్‌చైర్లు, స్ట్రెచర్ అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐల బంధువులు

చంద్రగిరి: చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి అమెరాలో వుంటున్న ఎన్‌ఆర్‌ఐలు నరేంద్రనాథ్‌రెడ్డి, హైమావతి బుధవారం రెండు వీల్ చైర్లు, ఒక స్ట్రెచర్ అందజేశారు. వారు అమెరికాలో వుంటున్నా సొంత ఊరికి తమవంతు సాయం చేయాలని భావించారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వీల్ చైర్లు, స్ట్రెచర్ అవసరమని బంధువుల ద్వారా తెలుసుకున్నారు. మంగళవారం బంధువుల ద్వారా రెండు వీల్ చైర్లు, ఒక స్ట్రెచర్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీలక్ష్మీ, కవిత, కీర్తి, జీనత్, స్వర్ణ, సుష్మా, హేమంత్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్



తిరుపతి మంగళం : తిరుపతి–కరకంబాడి మార్గంలోని మారస సరోవర్ హోటల్‌కు వెళ్లే సర్కిల్ వద్ద బుధవారం సుమారు గంట పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఉదయం 8 నుంచి 9గంటల మధ్యలో పాఠశాలలకు, ఉద్యోగాలకు వెళ్లే తొందరలో వాహనచోదకులు ఎటుపడితే అటు అడ్డదిడ్డంగా వెళ్లడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సుమారు గంట పాటు ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

రుయాకు బ్రోకోస్కోప్ వితరణ

తిరుపతి తుడా: యశోదా ఆస్పత్రుల ఇంటర్నేషనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ హరికిషన్ రుయా ఆస్పత్రి పల్మనాలజీ మెడిసిన్ విభాగానికి సుమారు రూ.5లక్షల విలువైన వీడియో బ్రోన్కోస్కోప్‌ను విరాళంగా అందించారు. ఈమేరకు రుయా ఆస్పత్రిలో బుధవారం ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జే రాధకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్మనరీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు, వైద్యులు పాల్గొని దాతను అభినందించారు.

ఆక్రమణల చెరలో కాలువలు

ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో పెద్ద కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. నగరంలో చిన్నపాటి వర్షానికే కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. శేషాచలం అడవుల నుంచి జాలువారే వర్షపు నీరు నగరం దాటడం సవాలుగా మారింది. దీంతో కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో ఈ సమస్య ఎదురవుతున్నా శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ముంపు సమస్య ఎదురైనప్పుడు నానా హంగామా చేసి ఆపై చేతులు దులిపేస్తున్నారు.

– తిరుపతి తుడా

- రోజు రోజుకు కుచించుకుపోతున్న పెద్ద కాలువలు
- గత అనుభవాల నుంచి పాఠం నేర్వని అధికారులు
- చిన్నపాటి వర్షానికే పొంగి పొర్లుతున్న కాలువలు
- కాలువలు లేకపోతే తప్పని వరద ముప్పు

తిరుపతి నగరం సప్తగిరుల పాదాల చెంత విస్తరించింది. అయితే ఇక్కడ అనేక ప్రజా సమస్యలు తిష్ట వేశాయి. దశాబ్దాలుగా వాటిని పరిష్కరించడంలో అటు పాలకులు ఇటు అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. చిన్నపాటి వర్షానికే నగరం ముంపు పాలవుతోంది. లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి.

ఇదీ నీటి ప్రవాహం


వర్షపు నీరు ఉత్తరం, పడమటి దిశల నుంచి నగరం మీదుగా ప్రవహిస్తుంటుంది. ఇందుకు శతాబ్ద కాలం నుంచి ప్రధానంగా మూడు పెద్ద కాలువలు మీదుగా వర్షపు నీరు నగరం దాటి వివిధ మార్గాల ద్వారా స్వర్ణముఖి నదిలో కలుస్తుంది. నగరం మీదుగా వర్షపు నీరు ప్రవహించేందుకు ప్రధానంగా మూడు పెద్ద కాలువలు ఉన్నాయి. కపిలతీర్థం నీళ్లు శివజ్యోతినగర్ మీదుగా వినాయక సాగర్‌కు చేరుతాయి. అలానే మాలాడి గుండం నీళ్లు ఎన్జీవో కాలనీ, భవాని నగర్, కొర్లగుంట మీదుగా నగరం దాటి ప్రవహిస్తుంటాయి. అలానే పడమటి ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు పద్మావతి కళాశాల, ఎస్వీ నగర్, ఎంఆర్ పల్లి , కేశవాయనగుంట మీదుగా ప్రవహిస్తాయి.

ఆక్రమణలు అనేకం

ఈ కాలువలు ప్రారంభ దశలో 20 నుండి 30 అడుగుల మేర వెడల్పుతో ఉండగా నగరంలోకి వచ్చేసరికి 5 అడుగుల వెడల్పుకు చేరింది. కాలువలకు ఇరువైపులా ఆక్రమణలకు గురయ్యాయి. ఎక్కడికక్కడ కబ్జా రాయుళ్ల చేతిలో కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో నగరంలో చిన్నపాటి వర్షం పడినా కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరుతోంది. కాలువలు కంటే తక్కువ ఎత్తులో ఉన్న రోడ్ల పైకి మోకాళ్ల లోతు నీళ్లు చేరుతున్నాయి. దీంతో ప్రజా రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. వర్షాకాలం వచ్చిందంటే అనేక ప్రాంతాల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

పాఠాలు నేర్వని అధికారులు

తిరుపతి నగరంలో 2017, 2021వ సంవత్సరంలో తుపానులు బీభత్సం సృష్టించాయి. తిరుపతి చిగురుటాకులా వణికిపోయింది. 30 శాతం ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. అనేక ప్రాంతాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. తిరుపతి నగరం ఎప్పుడూ చూడని ముంపునకు గురైంది. అయినా అధికారులు గత అనుభవాల నుండి పాఠం నేర్వలేదు. ఈ ఏడాదిలోనూ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. అధికారులు కాలువల ఆక్రమణలపై దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపించాల్సి ఉంది.



కొర్లగుంట ప్రాంతంలో కుచించుకుపోయిన కాలువ

నాడు హంగామా

2017లో భారీ తుపాను నగరాన్ని అతలాకుతలం చేసింది. ఈ క్రమంలో నాటి కలెక్టర్, కమిషనర్లు నగరంలో విస్తృతంగా పర్యటించారు. కాలువల ఆక్రమణలపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. నగరంలోని పెద్ద కాలువల రీ సర్వేకు ఆదేశించారు. కొన్ని రోజులపాటు నానా హంగామా చేసి, ఆపై ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారు. గత ప్రభుత్వ హయాంలో నగరంలో రోడ్లు, మురుగు కాలువల విస్తరణ, ఆధునీకరణకు పెద్ద పీట వేశారు. వందల కోట్ల వ్యయంతో అనేక ప్రాంతాల్లో ముంపు సమస్య నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించారు. ప్రధానంగా ఎయిర్ బైపాస్ రోడ్, లక్ష్మీపురం సర్కిల్ తదితర ప్రాంతాల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. అనేక ప్రాంతాల్లో ముంపు నుండి కొంతమేర ప్రజలకు ఉపశమనం తీసుకువచ్చారు. ప్రస్తుతం కాలువల ఆక్రమణలు పైఅధికారులు దృష్టి సారించి ముంపునకు, వర్షపు నీటి ప్రవాహానికి శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీస్ బోర్డు

- జాతీయ సంస్కృత యూనివర్సిటీలో గురువారం ఉదయం 10 నుంచి డిగ్రీ, పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు
- అథ్లెటిక్స్ మీట్‌లో భాగంగా శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం ఉదయం 10 నుంచి అర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్ జోనల్ స్థాయి పోటీలు.
- ఎస్వీయూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 2025–26 కోర్సుల్లో ప్రవేశానికి గురువారం సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం.

నేడు ఎంబీయూ భారీ ర్యాలీ

చంద్రగిరి: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని రంగంపేటలోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ) ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద యం 10 గంటలకు యూనివర్సిటీ నుంచి వందలా ది మంది విద్యార్థులు జాతీయ జెండాలను చేతబట్టి రంగంపేట వరకు ర్యాలీ చేపట్టనున్నారని పేర్కొన్నారు.

స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా వెంకట్రావు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ పి.వెంకట్రావును నియమిస్తూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు

పాఠశాలకు బెంచీలు, వాటర్ ప్లాంట్ వితరణ

చంద్రగిరి: మండలంలోని కొటాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు దాతలు బెంచీలు, వాటర్‌ప్లాంట్, డైరీలను వితరణ చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎంఈవో–2 భాస్కర్‌బాబు, స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు. సుమారు రూ.3 లక్షల విలువైన 30 బెంచీలతో పాటు వాటర్‌ప్లాంట్, విద్యార్థులకు డైరీలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ వైద్యశిబిరానికి స్పందన



కార్మికులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

తిరుపతి తుడా: స్థానిక ఆర్సీ రోడ్డులోని కార్మిక రాజ్య బీమా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి సమీపంలోని సీఎంఆర్ ఎకో అల్యూమినియం కంపెనీలో వైద్య శిబిరం నిర్వహించారు. కంపెనీలో పనిచేసే సిబ్బంది, కార్మికులకు ఈఎస్‌ఐ ఆస్పత్రి వైద్యులు వైద్య సేవలు అందించారు. శిబిరంలో ఆర్‌ఎంఓ డాక్టర్ ఏపీఎస్ ప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు

సంఘాలకు సహకరించండి

తిరుపతి అర్బన్: ఉపాధ్యాయ సంఘాలకు పూర్తి సహకారం అందించాలని, తమ సమస్యలకు పరిష్కారం చూపాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘం ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఉప విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఇందిరాదేవిని ముందుగా సన్మానించారు. అనంతరం ఆమెకు సమస్యలను తెలియజేశారు. తమకు సహకారం అందించాలని కోరారు. సంఘం నేతలు నాగరాజు, సాంబిరెడ్డి, సుభాష్‌చంద్రబోస్, సురేష్, దలవాయి, ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సహకారశాఖ అధికారి నాగవర్ధన అన్నారు. బుధవారం తిరుపతిలోని కెనడీ నగర్‌లోని డివిజన్ సహకార శాఖ కార్యాలయం నుంచి సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం ర్యాలీని నిర్వహించారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి, డివిజనల్ అధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

కూటమి మోసాలను ఎండగట్టండి



ముస్లిం, మైనారిటీ నాయకులతో భూమన అభినయ్‌రెడ్డి

– జగనన్న పాలనలోనే ముస్లిం, మైనార్టీల సంక్షేమం

తిరుపతి మంగళం : ఏడాదిన్నర కాలంగా ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం పార్టీ ముస్లిం, మైనార్టీ విభాగం నగర అధ్యక్షుడు మహ్మద్‌కాసీమ్ బాషా(చోటాబాయ్) ఆధ్వర్యంలో ముస్లిం, మైనార్టీలతో భూమన అభినయ్ రెడ్డి సమావేశం నిర్వహించారు. జగనన్న ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు సంక్షేమ పథకాలతో సుభిక్షంగా జీవించారని ఆయన గుర్తుచేశారు. అయితే అధికార దాహంతో నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ ప్రజా ద్రోహులని అన్నారు. కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారు ప్రజల్లో తిరగాలంటే సిగ్గుతో తలదించుకునేలా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనార్టీ నాయకులు షయ్యద్ షఫీ అహ్మద్‌ఖాదరీ, షేక్ ఖాదర్ బాషా, షేక్ ఇమ్రాన్ బాషా, గఫూర్, అబ్దుల్, చాంద్‌బాషా, ఫరీద్ బాయ్, సలీం, షర్మిల, మౌలానా పాల్గొన్నారు.

కళాశాలకు పూర్వ విద్యార్థి విరాళం



చెక్కును ప్రిన్సిపల్‌కు ఇస్తున్న దాత గోవిందమ్మ

తిరుపతి సిటీ: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 1984–87 బ్యాచ్‌కు చెందిన సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమో పూర్వ విద్యార్థి సురేష్‌బాబు కళాశాలకు రూ.1,71,690 విరాళంగా అందజేశారు. వృత్తిరీత్యా అమెరికాలో స్థిరపడ్డ ఆయన బుధవారం తన మాతృమూర్తి గోవిందమ్మ చేతులమీదుగా చెక్కును ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డికి అందజేశారు. కళాశాలలో హైడ్రాలిక్స్ ల్యాబ్ కోసం నిధులను వినియోగించాలని సూచించారు. ప్రిన్సిపల్ గోవిందమ్మను అభినందించి సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఎస్పీడబ్ల్యూలో హర్‌ఘర్ తిరంగా



జాతీయ జెండాతో ర్యాలీ

తిరుపతి సిటీ: పద్మావతీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఫిజిక్స్ విభాగం, స్థానిక ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం బుధవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. వెయ్యి మీటర్ల జాతీయ పతాకాన్ని చేతబూని విద్యార్థినులు, అధ్యాపక బృందం జాతీయ సమైక్యతను పెంపొందించే నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరుమల నారాయణమ్మ, ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ శ్రీనివాస్ నెహ్రూ, అధ్యాపకులు ఉమారాణి, సునీత, వసుధ, జయశ్రీ, లక్ష్మీసంధ్య, ఉమామహేశ్వరి, రాధాకృష్ణ పాల్గొన్నారు

మూషిక వాహనంపై గణనాథుడు



పాకాల: మండలంలోని ఊట్లవారిపల్లికి సమీపంలోని పాళ్యం కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో బుధవారం 77వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మూషిక వాహనంపై వినాయస్వామి విహరించారు. ఉదయం 10.30 గంటలకు అక్కగార్ల పూజ, సాయంత్రం 4 గంటలకు గణపతి పూజ, కంకణధారణ, పుణ్యహవాచనం, మృత్స్యగ్రహణం, వస్తు శాంతి, అంకురార్పణం, కలశస్థాపన నిర్వహించారు. రాత్రి 7 గంటలకు మూషిక వాహనంపై వినాయక స్వామిని అంగరంగ వైభవంగా ఊరేగించారు. తమ ఇంటి ముంగిటకు వచ్చిన స్వామివారికి భక్తులు కర్పూర హారతులు పట్టారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహానికి చెన్నుగారిపల్లి పంచాయతీ బార్లీకొండ బంగ్లా గ్రామానికి చెందిన కొత్తపల్లి గౌతం స్వామివారికి భారీ గజమాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సోంపల్లి చంద్రశేఖర్‌నాయుడు, ఈఓ సూరే యువరాణి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవయవదానం మరొకరికి ప్రాణదానం



అవగాహన పత్రాలను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: అవయవదానం పట్ల అవగాహన పెరిగితే తద్వారా అనేక మందికి పునర్జన్మ ప్రసాదించవచ్చని, అవయవదాన సంధానకర్త ఎస్‌వీఎస్ ప్రసాద్, ఎస్వీ మెడికల్ కళాశాల వైద్యుడు డాక్టర్ సతీష్ నాయక్ తెలిపారు. ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాప్రస్థాన సేవా సమితి, గోవిందధామం, వేమన విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వేమన విజ్ఞాన కేంద్రంలో బుధవారం అవయవదానం–అవయవాల మార్పిడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి అవయవదానంపై అవగాహన పత్రాలను ఆవిష్కరించి ప్రసంగించారు. మనిషి మరణించిన తర్వాత దానం చేయగలిగేవి కళ్లు, పూర్తి శరీరం మాత్రమేనని, బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరి తిత్తులు, ప్రేగులు, ఎముకలు, మూలుగ, చర్మం వంటివి తీసుకోవచ్చని తెలిపారు. ఇవి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అమర్చడంతో తాను చనిపోయినా ఇతరులను బతికించే అవకాశం ఉంటుందని తెలిపారు. మరో అతిథి నేత్ర వైద్యులు డాక్టర్ హిమబిందు, కిడ్నీ వ్యాధుల నిపుణులు డాక్టర్ శివపార్వతి మాట్లాడుతూ మనిషి చనిపోయిన 6 గంటల్లోపు శరీరాన్ని కాని, కళ్లను, సేకరించడానికి అవకాశం ఉందని, ఇవి చేయాలంటే కుటుంబ సభ్యుల అనుమతి తప్పనిసరని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవిందధామం అధ్యక్షుడు జె.లక్ష్మి, కార్యదర్శి ఎస్.రామశేఖర్, కోశాధికారి హేమచందర్, టెంకాయల దామోదరం, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, జయరాం, ప్రసాద్ ముఖేష్, గురునాథం పాల్గొన్నారు.

శ్రీదండాయుధపాణికి శాస్త్రోక్తంగా తిరుమంజనం

తిరుపతి రూరల్ : మండలంలోని తణపల్లి పద్మగిరి కొండపై వెలసిన శ్రీబాలజ్ఞాన దండాయుధపాణి ఆలయంలో గురువారం ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు షణ్ముఖ శర్మ గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి తమిళ సంప్రదాయాలను అనుసరించి తిరుమంజనాన్ని నిర్వహించారు. ముందుగా వట్టివేరు, పుట్టమట్టి, పరిమళభరిత సుగంధ ద్రవ్యాలు, పత్రాలు, పుష్పాలతో తయారు చేసిన చూర్ణంను గర్భాలయంతో పాటు ఆలయంలోని పరివార దేవతలు, ధ్వజస్తంభానికి పట్టించి మంచి నీటితో శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు విజయసింహారెడ్డి, బాలచంద్రారెడ్డి, హేమంత్‌కుమార్‌రెడ్డి, గ్రామపెద్దలు, ఆలయ పెద్దలు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తొలగించండి



డ్రైనేజ్ కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరంలోని అన్ని కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ (చెత్త, పేరుకుపోయిన మట్టి) తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఎల్‌బీసీ రోడ్డు, ఆఫీసర్ క్లబ్, రామకృష్ణాపురం, హమీద్ నగర్, మంచినీళ్ల కుంట తదితర ప్రాంతాల్లో ప్రజా ఫిర్యాదులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీ కాలువలు లీక్ అవుతున్నాయని, వర్షపు నీరు ఆగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని, నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తొలగించి మురుగునీరు సజావుగా వెళ్లేలా చూడాలని ఆదేశించారు. రోడ్లపైన, కాలువల్లో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానాలు విధించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, అధికారులు, సిబ్బంది ఉన్నారు


ఘనంగా గంగ జాతర



అమ్మవారికి సారె సమర్పిస్తున్న సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి దంపతులు

చంద్రగిరి: మండలంలోని రామిరెడ్డిపల్లి పంచాయతీ నాగయ్యగారిపల్లి హరిజనవాడలో బుధవారం రాత్రి గంగజాతరను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి ప్రతిమను గ్రామంలో కొలువుదీర్చారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అంబళ్లు సమర్పించారు. పాల పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు అమ్మవారికి సారెను సమర్పించారు. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు.

వ్యాసరచన పోటీ విజేత సోమశేఖర్



జగపతి సోమశేఖర్

తిరుపతి కల్చరల్: న్యూఢిల్లీ భారత ప్రభుత్వ రక్షణ శాఖ వారు నిర్వహించిన 'ఆపరేషన్ సింధూర్– ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ విధానాన్ని పునర్నిర్వచించడం' అనే అంశంపై గత జూన్ 1 నుంచి జూలై 31 వరకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో తిరుపతికి చెందిన జగపతి సోమశేఖర్ విజేతగా ఎంపికయ్యారు. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 20,557 మంది హాజరు కాగా 200 మందిని విజేతలుగా ప్రకటించారు. ఇందులో దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జగపతి సోమశేఖర్ విజేతగా నిలిచారు.

ఏపీఎం రజనిపై దాడిని ఖండిస్తూ నిరసన

తిరుపతి రూరల్ : అన్నమయ్యజిల్లా గుర్రంకొండ మండలానికి చెందిన ఏపీఎం రజనిపై సంఘమిత్ర నాగరాజమ్మ, ఆమె అనుచరులు దాడిచేయడాన్ని ఖండిస్తూ తిరుపతి రూరల్ మండలంలోని వెలుగు సిబ్బంది మండల సమాఖ్య కార్యాలయం ముందు బుధవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏపీఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎంలపై దాడిచేసే పరిస్థితులు రావడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి దుశ్చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం దుర్వాసులు నాయుడు, సీసీలు రమేష్, ధనంజయ, చిత్ర, సుజాత, వాహిని, రవి, దీప పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు భద్రత కల్పించాలి

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుమల శ్రీవారి దర్శనార్థం ముందుగా తిరుపతి పుణ్యక్షేత్రంలోని విచ్చేస్తున్న భక్తుల భద్రతను టీటీడీ బాధ్యతగా గుర్తించాలని తిరుక్షేత్రాల రక్షణ సమితి నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం వారు టీటీడీ ఈవో శ్యామలరావును కలసి వినతి పత్రం అందించారు. ఇటీవల తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద భక్తులపై ఆటోవాలాల దాడుల అంశాన్ని ఈవో దృష్టికి తీసుకెళ్లారు. రోజు రోజుకు పెరగుతున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని తిరుపతి ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ల నుంచి తిరుచానూరు, అలిపిరి, శ్రీవారి మెట్టు ప్రాంతాలకు టీటీడీ ఉచిత రవాణా (ధర్మ రథం) బస్సుల సంఖ్యను మరింత పెంచాలని కోరారు.

త్రివర్ణ శోభితం



కలెక్టరేట్ జాతీయ పండుగ శోభను సంతరించుకుంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మువ్వన్నెల విద్యుద్దీపాల వెలుగులు విరజిమ్ముతోంది. తిరుపతి నగర వాసుల్లో దేశభక్తిని ఇనుమడింపజేస్తోంది. నేషనల్ హైవేపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులను విశేషాలంకరణ ఆకట్టుకుంటోంది.

– తిరుపతి అర్బన్



చంద్రగిరిలోని రాయలవారి కోట మువ్వన్నెలతో శోభాయమానంగా వెలుగొందుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆర్కియాలజీ ఆధ్వర్యంలో త్రివర్ణం.. సగర్వంగా ఆవిష్కృతమైంది. జాతీయ జెండా రంగులతో విద్యుద్దీప కాంతులీనుతోంది. కోట సందర్శనకు విచ్చేస్తున్న పర్యాటకులను ఆకట్టుకుంటోంది.

– చంద్రగిరి